రైతుల కష్టాలు పట్టని ప్రభుత్వం

- తొలి నుంచి వ్యవసాయమంటే బాబుకు అలుసే
- యూరియా కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి
- 'అన్నదాత పోరు'లో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- రైతు సమస్యలపై ఆర్డీఓకు వినతి
- అడుగడుగునా పోలీసుల ఆంక్షలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, పార్టీ నాయకులు

డోన్: రాష్ట్రంలో అన్నదాతలు ఎరువుల కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే, కూటమి ప్రభుత్వం మాత్రం ‘సూపర్ సిక్స్ – సూపర్ సక్సెస్’ అంటూ సంబరాలు జరుపుకోవడం సిగ్గుచేటు అని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విఘ్నేశ్వరరెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం డోన్‌లో నిర్వహించిన ‘అన్నదాత పోరు’ నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రంగా విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతు సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, రైతు భరోసా, ధరల స్థిరీకరణ నిధి, భూసార పరీక్షలు వంటి పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. ఆయన వారసుడు జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలు, పంట కొనుగోలు, ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీలతో రైతాంగానికి అండగా నిలిచారని తెలిపారు. కానీ కూటమి ప్రభుత్వం మాటలతో మోసం చేస్తోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రైతు భరోసా మొత్తాన్ని చెల్లించలేదని, ఇన్‌పుట్ సబ్సిడీలు, ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు కూడా అందించని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. గతంలో పంట రుణమాఫీ పేరుతో రైతులను మోసగించిన టీడీపీ మరోసారి అదే తంతు పునరావృతం చేసిందని మండిపడ్డారు.

యూరియా దిగమింగారు

మండలానికి మంజూరైన 70 టన్నుల యూరియాను అధికార పార్టీ నాయకులు రైతులకు తెలియకుండా వారి ఆధార్ నంబర్లపై నమోదు చేసి దిగమింగారని మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు ఆరోపించారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహం ఆయన మాట్లాడారు. రైతులు ఎరువుల కోసం ఆందోళనలు చేస్తుంటే, కూటమి నేతలు సంబరాలు జరుపుకోవడం విడ్డూరమని విమర్శించారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులను విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఆయన పాలనలో రైతులకు కష్టాలు తప్పవన్నారు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆ పార్టీ నాయకులకు గొప్పలు చెప్పుకోవడం తప్పా అన్నదాతలకు న్యాయం చేయడం తెలియదన్నారు. పెట్టుబడి సాయం మొదలు బీమా వరకు కర్షకులకు ఎలాంటి భరోసా కల్పించలేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని నేతలు హెచ్చరించారు. కాగా అన్నదాత పోరుకు పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించినా వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమావేశంలో వ్యవసాయ విభాగం కార్యదర్శి మెట్టు వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్‌లు బోరెడ్డి పుల్లారెడ్డి, మల్లెంపల్లె రామచంద్రుడు, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, డోన్ జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, బేతంచర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి, పార్టీ నాయకులు బీవీ నాగార్జున రెడ్డి, హరినాథ్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, రమణ, తులసిరెడ్డి, పాదొడ్డి కృష్ణమూర్తి, చిన్న పూజర్ల రామచంద్రారెడ్డి, కమతం భాస్కర్‌రెడ్డి, బుర్గుల శ్యామ్‌సుదర్‌రెడ్డి, బోరెడ్డి రాము, అలెబాద్ బాలయ్య, నెరేడుజెల్ల అనీల్, గుడిపాడు పుల్లారెడ్డి, జలదుర్గం రసూల్, శీను, సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి, ఆర్ఈ రాజవర్ధన్, క్యాలిటీ అబ్దుల్లా, లక్ష్మీరెడ్డి, ఇబ్రహీం, రామచంద్రుడు, ఎర్రిస్వామి, భూమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, జయరామిరెడ్డి, సుధాకర్‌యాదవ్, బోరెడ్డి రామచంద్రారెడ్డి, గద్దం రామచంద్రారెడ్డి, చిరంజీవి, మిట్ట రవి, పాలుట్ల రఘురామ్, భూషన్‌రెడ్డి, వెమారెడ్డి పాల్గొన్నారు.

అన్నదాత పోరుకు తరలిన నేతలు

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి కోవెలకుంట్ల మండలం నుంచి రైతులతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జున రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, వెలగటూరు సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు డోన్‌కు చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఎల్‌బీసీ రామసుబ్బారెడ్డి, కానాల రవీంద్రనాథరెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, మల్లు హరినాథరెడ్డి, డీవీ శేషిరెడ్డి, ఏర్వ శేషిరెడ్డి, రఘునాథరెడ్డి, ముక్కమల్ల రామసుబ్బారెడ్డి, ఉప్పరి సుబ్బరాయుడు, సుధాకర్‌రెడ్డి, రాజేంద్రనాథరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, షరీఫ్, తిరుపాల్, బాలకంబన్న, నాగ ఉసేని, విజయ్, బాలకృష్ణ, తిమ్మయ్య తదితరులు తరలివెళ్లారు.

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం

బేతంచెర్ల: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, అధికార ప్రతినిధి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం రైతుల సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ తలపెట్టిన అన్నదాత పోరు నిరసన కార్యక్రమానికి బేతంచెర్ల మండలం నుంచి రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. రైతులకు అవసరమైన యూరియా, పంటలకు గిట్టుబాటుధర కల్పించడం లేదని నాయకులు, అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, సర్పంచ్‌లు కోడె వెంకటేశ్వర్లు, శ్రీరాములు, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, కుమార్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, చలపతి రెడ్డి, వెంకిరెడ్డి, మల్దిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, తిమ్మయ్య, ఎద్దులన్న, మనోహర్, హెన్రీ బాబు, పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్ రెడ్డి, పిట్టల జాకీర్ పాల్గొన్నారు.


బేతంచెర్ల నుంచి డోన్‌కు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు,


కోవెలకుంట్ల నుంచి డోన్‌కు తరలివెళ్తున్న పార్టీ నాయకులు

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం


రూ. 25 వేల చెక్కును అందుకుంటున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు

కోవెలకుంట్ల: మండలంలోని ఎం. గోవిందిన్నె మెట్ట సమీపంలో ప్రకృతిపీఠం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పంచమహాయజ్ఞముల ఆలయ నిర్మాణానికి మంగళవారం కోవెలకుంట్లకు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు రూ. 25వేలను పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు రసూల్, యూసఫ్, బాషా, శివ పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

బేతంచెర్ల: రైతులు పంటల సాగులో మోతాదుకు మించి ఎరువులు, క్రిమిసంహారక మందులను వాడొద్దని జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి రైతులకు సూచించారు. మంగళవారం బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ఏఓ విజయకుమార్ రెడ్డితో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పంట మార్పిడి, ఎరువుల వినియోగం, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. యూరియా ఎక్కువగా వేయడం వల్ల దిగుబడి పెరగకపోగా ఖర్చులు పెరుగుతాయని తెలిపారు. మట్టి నమూనాల ఆధారంగా యూరియాను వాడాలని సూచించారు. భవిష్యత్తు అంతా నానో యూరియాదే అని పేర్కొన్నారు.

పుట్ట పెద్దమ్మకు ప్రత్యేక పూజలు


పుట్ట పెద్దమ్మ


బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె మార్గంలోని పుట్ట పెద్దమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అభిషేకం, పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. అదే విధంగా అమ్మవారి శాలలోని వాసవీ మాతకు ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఇక కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవి, సిమెంట్‌నగర్ గ్రామంలోని సుంకులా పరమేశ్వరీ దేవి ఆలయాల్లోనూ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ


ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షకు సిద్ధమవుతున్న 30 మంది విద్యార్థులకు మంగళవారం ఉచిత మెటీరియల్ అందజేశారు. నంద్యాల కళాభారతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు విజయభాస్కర్ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. సుమారు రూ.10 వేల విలువ చేసే మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేయడం అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం వెంకటకొండయ్య పేర్కొన్నారు. విద్యార్థుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు బాలమద్దిలేటి, నాగలింగయ్య, పూజారి శ్రీనివాసులు, రాజ్యలక్ష్మీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వసతి గృహానికి ప్రింటర్ విరాళం



హాస్టల్‌కు ప్రింటర్ అందజేస్తున్న దాత

డోన్: స్థానిక బాలికల వసతి గృహానికి ఎర్రగుంట్ల వెంకటేశ్వర్లు కుమార్తె సునీత సహకారంతో రూ.15 వేల విలువైన ప్రింటర్‌ను ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు మంగళవారం అందజేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తుండడం గర్వకారణమని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శకుంతలరెడ్డి, జయలక్ష్మి అన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

పింఛన్ దరఖాస్తుకు ఎదురుచూపు


దరఖాస్తుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్న దివ్యాంగులు

కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా పింఛన్ దరఖాస్తు చేసేందుకు వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. అంకిరెడ్డిపల్లెకు చెందిన దివ్యాంగులు వెంకటేష్, రాముడు పింఛన్ దరఖాస్తుకు సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు. దివ్యాంగులం కావడంతో ఏపనికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది పైనుంచి ప్రభుత్వం ఎప్పుడు దరఖాస్తుకు అవకాశం ఇస్తారా అని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నామని చెప్పారు. ఒక కాలు పూర్తిగా తొలగించడంతో ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి నెలకొందని వెంకటేష్ వాపోయారు. పక్షవాతం రావడంతో కాలు, చేయి పూర్తిగా పని చేయడం లేదని రాముడు తెలిపారు. ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తే కొంత వరకు ఆధారం ఉంటుందన్నారు. కాగా గ్రామాల్లో చాలా మంది దివ్యాంగులు పింఛన్‌ల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

సచివాలయాల తనిఖీ

ప్యాపిలి: మండల పరిధిలోని బోంచెర్వుపల్లి, రాచర్ల గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు తీరును పరిశీలించారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. సమయ పాలన పాటిస్తూ అంకితభావం కలిగి ఉండాలని సూచించారు.

దొంగల అరెస్ట్

బేతంచెర్ల: మండలంలోని ముద్దవరం గ్రామంలో ఈ నెల 5,6వ తేదీల్లో జరిగిన బోరు మోటర్, రాగి వైరు దొంగతనానికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామ రైతులు తిమ్మగురుడు, సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు సీఐ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో నిందితులు బేతంచెర్లకు చెందిన నాగరాజు, ఫణిని సిమెంట్‌నగర్ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి దొంగిలించిన బోరు మోటర్, 100 మీటర్ల రాగి వైరు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను మంగళవారం డోన్ కోర్టుకు రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలి

- సీఐ ఇంతియాజ్‌బాషా


హాస్టల్ వార్డెన్‌లతో మాట్లాడుతున్న సీఐ

డోన్ టౌన్: వసతి గృహాల్లో విద్యార్థులపై నిర్లక్ష్యం తగదని, వార్డెన్లు స్నేహపూర్వకంగా వ్యవహరించి వారి మానసిక స్థితి, ప్రవర్తనను గమనిస్తూ తగిన సూచనలు చేస్తూ సరైన దారిలో నడిపించాలని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా సూచించారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో వసతి గృహాల వార్డెన్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇటీవల శ్రీరామనగర్‌లోని ప్రభుత్వ బాలుర కళాశాల హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై చర్చించారు. తల్లిదండ్రుల ఫిర్యాదులు, రాగింగ్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయాలను ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల గురించి తరచుగా హాస్టల్ వార్డెన్లతో, ఉపాధ్యాయులతో సంప్రదించాలన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో దండన కంటే స్నేహపూర్వకత అవసరమని, ధైర్యం నింపాలని సూచించారు. సమావేశంలో వార్డెన్లు మధు, లక్ష్మీబాయి, మేరీ సూర్యకుమారి, సువర్ణ, అమర్నాథరెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై ఎమ్మెల్యే కోట్ల ఆరా

శ్రీరామనగర్ ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి ఘటనపై ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి మంగళవారం హాస్టల్‌ను సందర్శించారు. వార్డెన్ మేరీ సూర్యకుమారిని వివరాలు అడిగి తెలుసుకుని, విద్యార్థులపై నిర్లక్ష్యం చూపకూడదని, హాస్టల్ నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

హత్యకేసులో మరో ఇద్దరి అరెస్టు

కర్నూలు: నగరంలోని కొత్తపేటకు చెందిన బంగారు నగల తయారీదారుడు షేక్ ఇజహర్ అహ్మద్ (45) హత్యకేసులో మరో ఇద్దరు నిందితులు ఇమ్రాన్, యూసుఫ్‌లను ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. రెండు కుటుంబాల మధ్య గొడవల కారణంగా షేక్ ఇజహర్ అహ్మద్ ఈనెల 1వ తేదీన రాధాకృష్ణ థియేటర్ వద్ద ఉన్న మసీదు బయట హత్యకు గురయ్యాడు. హతుడి తండ్రి షేక్ గౌస్ నిసార్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఐదుగురు వ్యక్తులకు హత్యలో ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేల్చారు. గనీగల్లీకి చెందిన షేక్ ఇమ్రాన్, మొగల్‌పుర వీధికి చెందిన ఎస్‌ఎండీ ఇర్ఫాజ్, ఖడక్‌పుర వీధికి చెందిన షేక్ జహీర్ అహ్మద్‌లను ముందు రోజు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా పరారీలో ఉన్న ఇమ్రాన్, యూసుఫ్‌లు తుంగభద్ర నది ఒడ్డున కోట వీధి రాఘవేంద్ర ఘాట్ వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో మంగళవారం ఇద్దరినీ అరెస్టు చేసి వారి వద్ద నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఒకటో పట్టణ సీఐ పార్థసారధి తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు


మంగలి కృష్ణ (ఫైల్)

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామానికి చెందిన మంగలి కృష్ణమూర్తి (50) కనిపించడం లేదని అతని కుమారుడు శ్రీరాములు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మతి స్థిమితం లేని తన తండ్రి మూర్ఛవ్యాధితో బాధపడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. జూలై 31వ తేదీ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నాడు. బంధువుల ఊర్లలో, ఇతర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదన్నాడు. శ్రీరాములు నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఫొటోలో వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు ప్యాపిలి పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ఆటో కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటో కార్మికులు

బేతంచెర్ల: ఆటోలతో ఉపాధి పొందుతున్న కార్మికులపై ప్రభుత్వానికి ఏమాత్రం కనికరం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, మండల కార్యదర్శి మధు శేఖర్ విమర్శించారు. మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మద్దిలేటి, పుల్లయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ నాగమణికి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగాల లేమితో నిరుద్యోగ యువకులు ఉన్నత విద్య చదివినా ఆటో డ్రైవర్‌లుగా మారుతున్నారని, కానీ ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల ఆటో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలు నష్టపోకుండా ఆర్థిక సహాయం అందించాలని, ఆటో కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రేపు విజయవాడలో మహా ధర్నా

డోన్ టౌన్: ఏపీ కేబినెట్ ఆమోదించిన ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం ఈ నెల 11వ తేదీ విజయవాడ ధర్నా చౌక్‌లో చేపట్టనున్న మహా ధర్నాకు ప్రత్యేక డీఎస్సీ అభ్యర్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ ప్రత్యేక ఉపాధ్యాయ సంఘం పిలుపునిచ్చింది. మంగళవారం స్థానిక సొసైటీ ఫర్ వర్కింగ్ ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ హ్యూమన్ ఆక్టివిటీ కార్యాలయంలో సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ కొండా లోకేష్‌రావు మాట్లాడుతూ.. ప్రత్యేక ఉపాధ్యాయుల భర్తీకి 2260 పోస్టులను తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్జీటీ పోస్టులను ప్రమోషన్‌ల పేరుతో తగ్గించరాదన్నారు. ఈ ధర్నాకు డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామన్నతో పాటు వివిధ జిల్లాల ఇన్‌చార్జ్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరుకు సిద్ధం


డీఈఈకి వినతి పత్రం అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

డోన్ టౌన్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని.. లేకుంటే ప్రత్యక్ష పోరాటాలు తప్పవని ఆ శాఖ ఉద్యోగ సంఘం డివిజన్ జేఏసీ చైర్మన్ రామకృష్ణ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం డివిజన్ ఇంజినీర్ కమలాకర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగదు రహిత వైద్యం, పాత పెన్షన్ విధానం, కంట్రాక్టు కార్మికులకు 2022 పీఆర్సీ బకాయిల చెల్లింపు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఈ నెల 15వ తేదీ నుంచి ప్రత్యక్ష పోరుకు సిద్ధమవుతామని తెలిపారు. జేఏసీ నాయకులు ఏఈలు నాగేశ్వరరెడ్డి, రేఖ, జేఏఓలు ఆదిలక్ష్మీ, రమేష్, లక్ష్మీకాంతరెడ్డి, వెంకటరాముడు, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

ఆగిన పనులు.. తప్పని కష్టాలు

- అంకిరెడ్డిపల్లెలో నిలిచిన అభివృద్ధి పనులు


అసంపూర్తిగా మిగిలిపోయిన సచివాలయ భవనం

కొలిమిగుండ్ల: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది అంకిరెడ్డిపల్లె పరిస్థితి. పేరుకేమో మండల కేంద్రం కొలిమిగుండ్ల కంటే జనాభా, ఓటర్ల సంఖ్యా పరంగా పెద్ద గ్రామం. అభివృద్ధి విషయంలో మాత్రం వెనుక బడి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు స్థానికంగానే సేవలు అందించేందుకు శాశ్వత భవనాలు మంజూరు చేస్తే అధికారుల నిర్లక్ష్యంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. రూ.80 లక్షలతో రెండు గ్రామ సచివాలయాలు మంజూరు చేయగా ఒక్కటి కూడా పూర్తి కాకుండా మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పటికీ అద్దె భవనంలో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఎప్పుడు తీవ్రంగా ఉంటుంది. మంచినీటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు గీతాశ్రమం సమీపంలో అదనంగా రూ.50 లక్షలతో జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. ట్యాంక్ పూర్తయి ఏడాది అయినా బోరు ఏర్పాటు చేసి పైపులైన్ ఏర్పాటులో జాప్యం చోటు చేసుకుంటోంది. పెద్ద గ్రామం కావడం, నాపరాతి గనులు, పాలీష్ ఫ్యాక్టరీలు ఉండడంతో ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.2.75 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేశారు. భూమి పూజ కూడా జరిగింది. ఇతర జిల్లాకు చెందిన వ్యక్తి కాంట్రాక్ట్ దక్కించుకుని పునాదులు తవ్వి వదిలిపెట్టారు. ప్రస్తుతం గ్రామంలోనే అద్దె భవనంలో పీహెచ్‌సీ నిర్వహణ జరుగుతోంది. ఐదు అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నా ఒక్కదానికీ సొంత భవనం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సిమెంట్ రోడ్డు మినహా ఎలాంటి పనులు చేయలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. పీహెచ్‌సీ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే బోరు వేసి పైపులైన్ నిర్మాణం చేపట్టి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను వాడుకలోకి తీసుకురావాలన్నారు.

ముందుకొచ్చిన ప్రమాదం..!


ముక్కమల్ల గ్రామం వద్ద మలుపులో రోడ్డుపైకి వచ్చిన కంపచెట్లు


ఆకుమల్ల-సుంకేసుల రోడ్డుపైకి వచ్చిన పిచ్చిమొక్కలు

సంజామల: మండలంలోని పలు రోడ్లపైకి ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలు చొచ్చుకురావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ముక్కమల్ల గ్రామంలోని ప్రధాన రహదారి మలుపు వద్ద పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ ఎల్-షేప్ మలుపు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడకపోవడమే కాకుండా, రోడ్డుపైకి కంపచెట్లు, పిచ్చిమొక్కలు రావడంతో ప్రమాద ముప్పు పొంచి ఉంది. అలాగే ఆకుమల్ల–సుంకేసుల రహదారిపై ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్లు, మొక్కలు వాహనదారులకు కష్టాలు కలిగిస్తున్నాయి. రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లలేని స్థితి ఏర్పడింది. అధికారులు తక్షణం స్పందించి రహదారులపైకి వచ్చిన ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.


నాడు.. ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద దుస్థితి (ఫైల్),


నేడు: సీసీరోడ్డు నిర్మాణం

ఎట్టకేలకు ఆర్టీసీ రోడ్లకు మోక్షం

సాక్షి ఎఫెక్ట్

కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ రోడ్లకు ఎట్టకేలకు మోక్షం లభించింది. బస్టాండ్ ఇన్‌గేట్, ఔట్‌గేట్లకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిని మోకాలి లోతు గుంతలతో దర్శనమిచ్చేవి. వర్షాకాలంలో శిథిలమైన రోడ్ల గుంతల్లో వర్షపు నీరు నిల్వ చేరడంతో వాహన చోదకులు, ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గడిచిన రెండు నెలల కాలంలో సాక్షి దినపత్రికలో ఆర్టీసీ బస్టాండ్ రోడ్ల దుస్థితిపై వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ మేరకు స్పందించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు బస్సులు లోపలికి, బయటకు వెళ్లే ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లస్థానంలో కొత్తగా సీసీరోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఇన్‌గేట్ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండువైపులా సీసీరోడ్ల నిర్మాణం పూర్తయితే వాహన చోదకులు, ప్రయాణికులకు శాశ్వత రోడ్డు కష్టాలు తీరినట్లే. –కోవెలకుంట్ల